


గవర్నర్ విందుకు చిలుకూరి మాస్టారు

ప్రజాశక్తి-కడియం

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడ రాజభవన్‌లో గవర్నర్ ఏర్పాటు చేసిన విందులో కడియం గ్రామానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. గవర్నర్ భవన్ ఆహ్వానం మేరకు శ్రీనివాస రావు ఎట్‌హోమ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గవర్నర్ శ్రీనివాసరావుని ఆత్మీయంగా పలకరించారు.



గవర్నర్ విందులో పాల్గొన్న చిలుకూరి

ఆన్‌లైన్ జూదం.. ఆడితే ప్రమాదం..

- ఆటవిడుపు క్లిక్‌లతో రూ.లక్షల్లో నష్టం
- అవగాహనతోనే పరిష్కారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

డిజిటల్ వైపు దూసుకుపోతున్న ఈ రోజుల్లో, ఆన్‌లైన్ జూదం కొత్త ప్రమాదంగా మారింది. తక్కువ శ్రమ.. అధికంగా నగదు అంటూ ఒక సినిమాలో ఒక దర్శకుడు హీరో చెప్పించిన డైలాగ్ చివరకు ఏ స్థితికి చేరుస్తుందో తెలిసిందే. అయితే దీన్ని భిన్నంగా అర్థం చేసుకున్న యువత అదే సూత్రాన్ని అనసరిస్తూ ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. యువతతో పాటు ఉద్యోగులు, గృహిణులు కూడా ఈ వలలో చిక్కుకుంటున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం నగరానికి చెందిన 28 ఏళ్ల యువకుడు ఒక ప్రకటన చూసి ఆసక్తితో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో చేరాడు. మొదటి రోజే రూ.500 పెట్టి రూ.3,000 గెలిచాడు. ఆ గెలుపు అతనికి నమ్మకాన్ని, ఉత్సాహాన్ని పెంచింది. కానీ క్రమంగా ఓటములు పెరిగి నగదు పోగొట్టుకున్నాడు. నష్టాన్ని పూడ్చుకోవడానికి అప్పులు తీసుకున్నాడు. చివరికి అప్పు భారంతో కుటుంబంతో విభేదాలు, ఒక్కొక్కటిగా కొత్త చిక్కులను తెచ్చిపెట్టాయి.

రూ.4 లక్షలు నష్టపోయాము

మా చిన్న కొడుకు డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నాడు. నాతో పాటు వ్యాపారంలో చేదోడుగా ఉంటాడని ఆశించాను. తొలుత స్నేహితులతో సరదాగా ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడేవాడు. నేనూ పెద్దగా పట్టించుకోలేదు. తర్వాత కొంత కాలానికి అతని ఖాతాల్లో నగదు పూర్తిగా ఖాళీ అయింది. అదేమని ప్రశ్నిస్తే ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టుకున్నానని తెలిపాడు. ఆన్‌లైన్ జూదం తాత్కాలిక ఆనందం ఇస్తుంది, కానీ చివరికి మిగిలేది పశ్చాత్తాపం మాత్రమే. ఇటువంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలి.

- సిహెచ్.ఉమామహేశ్వరరావు వ్యాపారి, మెయిన్ రోడ్డు, రాజమహేంద్రవరం.

రూపం మార్చుకుంటున్న జూదం

జూదం ఎప్పుడూ తన రూపం మార్చుకుంటోంది. 50 ఏళ్ల క్రితం పులిమేక, 1980లో పేకాట, 1990లో క్రికెట్ బెట్టింగ్ 2000లో ఆన్‌లైన్ బెట్టింగ్, తాజాగా ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా జూదం రక్కసి వెంటాడుతోంది. తాజాగా అరచేతిలోకి రావటంతో బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పేరు మారుతోంది తప్ప జూదం లక్ష్యం ఉద్దేశం మాత్రం మారడం లేదు. ఇందుకోసం అనేక యాప్‌లను అందుబాటులోకి తెచ్చి మరీ నిర్వహకులు యువతను ఆకర్షిస్తుండటం గమనార్హం. మరోవైపు సినీ ప్రముఖులు సైతం ఈ గేమ్‌లను ప్రమోట్ చేయటం విస్తుగొలుపుతోంది. పాలకుల తీరును దర్పణం పడుతోంది. వాటికి బానిసలై సొమ్ములు పోగొట్టుకోవడంతో పాటు కుటుంబాలకు, జన జీవనానికి దూరమవుతున్న వారు ఎందరో ఉన్నారు. ఒక దశలో ఆర్థికంగా చితికిపోయి ప్రాణాలు తీసుకుంటున్న ఉదంతాలు కోకొల్లలు. ఇటీవల గంజాయి కేసులో పట్టుబడిన నిందితుల గురించి పోలీసులు ఆరా తీస్తే బెట్టింగ్ యాప్‌ల బారిన పడి సొమ్ములు కోసం గంజాయి అక్రమ రవాణాకు దిగడం, ఎటిఎంలో వృద్ధులను మోసగించి కార్డు మార్చి నగదు చోరీ చేయటం వంటి కార్యకలాపాలకు దిగినట్లు తెలిసింది.



ఆర్థికంగా కుదేలు

ప్రవస్తుతం యువత, ఉద్యోగులు బెట్టింగ్ యాప్‌ల కారణంగా తీవ్రంగా నష్టపోవడమే కాక జీవితాలను కోల్పోతున్నారు. రూ.1 పెట్టుబడి పెడితే రూ.36 వస్తుందని నమ్మబలకడం ఆ తర్వాత రూ. వేలల్లో పెట్టుబడి పెట్టించి నిలువునా ముంచేయడం పరిపాటిగా మారింది. పల్లెల నుంచి పట్టణాల వరకూ ఇది పాకుతోంది. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు అక్రమార్కులు ఈ తరహా జూదాన్ని నడిపిస్తుండగా, మరి కొందరు పేద, మధ్య తరగతి ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం నగరంలోనూ అనేక మంది ఈ తరహాలో నష్టపోగా ఇటీవల పలు కేసులు నమోదయ్యాయి. నిరక్షరాస్యుల నుంచి విద్యావంతుల వరకూ అందరూ ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలో పోలీసులు పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నారు.



బేబికి స్వాగతం పలుకుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ఎం.ఎ.బేబికి ఘన స్వాగతం

పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించనున్న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి

గిరిజన సంప్రదాయంతో స్వాగతం పలికిన శ్రేణులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో పర్యటన నేపథ్యంలో మధురపూడి విమానాశ్రయానికి వచ్చిన సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబికి ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. తొలుత సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.లోకనాథం, తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బి.కిరణ్ పూలమాలలు వేసి, బొకేలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బేబి మీడియాతో మాట్లాడారు. తానూ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ వేర్వేరు మార్గాల్లో రెండు రోజుల పాటు పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. పర్యటన అనంతరం తమ డిమాండ్లను పత్రికా ముఖంగా తెలియజేస్తామన్నారు. అనంతరం కొద్దిసేపు స్థానిక నాయకులతో మాట్లాడారు. తరువాత రోడ్డు మార్గం గుండా దేవీపట్నం మండలంలోని పోలవరం నిర్వాసిత గ్రామాలకు బయలు దేరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, జె.రాంబాబు, పి.తులసి, జిల్లా నాయకులు ఎస్-ఎస్.మూర్తి, సుందర్‌బాబు, కె.రామకష్ణ, పూర్ణిమరాజు, రాంబాబు, రామకృష్ణ, మాచారావు, సత్తిరాజు, అరుణకుమారి, బేబిరాణి, రాజు, భాస్కర్, రాజేష్ , పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, తదితరులు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు మాట్లాడుతూ గౌతు లచ్చన్న చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి అనేక స్వాతంత్ర్య పోరాటాల్లో చురుకుగా పాల్గొని, బెర్హంపూర్, రాజమండ్రి జైళ్లలో కఠినమైన శిక్షలను అనుభవించారన్నారు. ఆయన బిసిల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ టి.సీతారామ్మూర్తి, బిసి సంక్షేమ అధికారి బి.శశాంక, బిసి సంక్షేమ అధికారులు ముత్యాల సుబ్బరాజు, టివి.ప్రసాద్ పాల్గొన్నారు.



గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న జెసి, కలెక్టరేట్ ఉద్యోగులు

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నిడదవోలు

అనుమానిత వ్యక్తులపై పట్ల, చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ పివిజి.తిలక్ ఆధ్వర్యంలో శనివారం ఆటోలపై అనుమానిత వ్యక్తుల ఫోటోలతో స్టిక్కర్లు అంటించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ తిలక్ మాట్లాడుతూ ఆటోల్లో ప్రయాణించే వారితో కలిసి ప్రయాణిస్తూ విలువైన బంగారం, డబ్బులు, సెల్ ఫోన్లు ఇతరత్రా వస్తువులను దొంగతనం చేసే వారి పేర్లు, ఫోటోలతో స్టిక్కర్లు వేసి ఆటోలపై అంటించామని, ఇటువంటి వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవరికైనా అనుమానం వస్తే, వీరి ఆచూకీ తెలిసిన యెడల సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ జగన్ మోహన్ రావు, ఎస్ఐ పరమహంస, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం బాగానే ఉంది

ప్రజాశక్తి-చాగల్లు

బస్సుల్లో మహిళలకు ఉచితం పెట్టడం చాలా సంతోషమని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం పోలవరం బస్సులో ఉచితంగా వెళ్లి తిరిగి వచ్చామని చాగల్లు గ్రామానికి చెందిన మహిళలు సంతోషం వ్యక్తపరిచారు. కానీ బస్టాండ్ లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉందని, బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి, రాత్రి సమయంలో లైట్లు వెలిగేలా చూడాలని, బాత్రూమ్ ఏర్పాటు చేయాలని మహిళలు సూచించారు. మండలంలో దారవరం సెంటర్, బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం, ఊనగట్ల, మీనా నగరం బస్సు రిక్వెస్ట్ స్టాపులు కొన్నేళ్ల నుంచి వాడకం లేకపోవడంతో పాడైపోయి శిథిలావస్థలో చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు.

సింహాద్రి రామకృష్ణకు బూరుగుపల్లి పరామర్శ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

టిడిపి మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణను రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు శనివారం పరామర్శించారు. రామకృష్ణ సోదరుడు రామారావు శుక్రవారం గుండెపోటుతో హఠాత్తుగా మరణించారు. కాల్దారి ఉప సర్పంచ్ ఈర్పిన సత్యనారాయణ, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఘనంగా ఎపిజిఇఎ గుర్తింపు దినోత్సవం

ప్రజాశక్తి-కడియం, కొవ్వూరు

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ గుర్తింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కడియం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులు వేడుకలు నిర్వహించారు. కెఆర్.సూర్యనారాయణ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉద్యోగుల సంక్షేమం, సమస్యల గురించి నిరంతరం పోరాడుతోందని సంఘం జిల్లా కార్యదర్శి విల్సన్ పాల్ తెలిపారు. నాలుగో తరగతి ఉద్యోగి మొదలుకొని గ్రూప్-1 అధికారి వరకు సంఘంలో సభ్యులుగా ఉన్నారని, ప్రభుత్వంతో నేరుగా చర్చలు జరిపేందుకు గుర్తింపు పొందిన సంఘం అని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూర్యశ్రీనివాస్, నాయకులు పి.మురళీకృష్ణ, డాక్టర్ టివి.శ్రీధర్, కెఎన్.మూర్తి, వి.ఉమామహేశ్వరి, అన్నపూర్ణ, సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ జి.మాధురి, డాక్టర్ మోహనవంశీ, డాక్టర్ కళ్యాణచక్రవర్తి సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు రోజు సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ నక్క వెంకటరత్నం, దాసరి మోహన్, సుంకవల్లి హరికృష్ణ, మద్రి సుబ్రమణ్యం, పోలిశెట్టి శివ పాల్గొన్నారు.



కొవ్వూరులో దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగ సంఘ ప్రతినిధులు

పేషంట్లతో మర్యాదపూర్వకంగా మెలగాలి

ప్రజాశక్తి-గోపాలపురం, గోకవరం

పేషంట్లతో మర్యాదపూర్వకంగా మెలగాలని, లేకుంటే చర్యలు తప్పవని డిప్యూటీ డిఎంహెచ్ఒ జె.సంధ్య హెచ్చరించారు. శనివారం మండలంలోని హుకుంపేట పిహెచ్‌సిని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఒపి రికార్డులను, పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వైద్య సిబ్బందికి నిర్దేశించిన సమయాల్లో ఆసుపత్రిలో ఉండాలని, ఒపి సేవలు మరింత పెంచాలని అన్నారు. పేషంట్లతో మర్యాదపూర్వకంగా మెలుగుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎం హెచ్ఒ పి.సరిత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ ఫీవర్స్‌పై ఆరా తీశారు. ఆసుపత్రిలోని రోగుల వివరాలు అడిగి తెలసుకున్నారు. గ్రామాల్లో వర్షాల కారణంగా ఫ్రైడే డ్రై డే ఆక్టివిటీస్ నిర్వహించాలని సూచించారు. పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ నిఖిత కొత్తపల్లిలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను పరిశీలించి రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, ఎఎన్ఎం నాగలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావడం అభినందనీయం

ప్రజాశక్తి-గోపాలపురం

విద్యార్థుల అవసరాలు తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని సర్పంచ్ జొన్నకూటి మణమ్మ అన్నారు. మండలంలోని వాదాలకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మానవత సభ్యులు వాసిరెడ్డి శ్రీనివాసరావు తండ్రి జ్ఞాపకార్థం రూ.20 వేలతో జారుడుబల్లను నిర్మించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో వందమంది విద్యార్థులకు నోటు బుక్స్ అందజేశారు. జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హోమ్ వర్క్ డైరీలను 170 మందికి సర్పంచ్ మణమ్మ, గ్రామ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వడ్లమూడి రమేష్, వల్లభనేని సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కొడమంచిలి విద్యాసాగర్, మండల మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షులు రాపాక ఫణి కిషోర్, నెల్లి చంద్రశేఖర్, గడా జోగేంద్ర ప్రసాద్, జుత్తిగ సూర్యచంద్రం, కుక్కల కీర్తి కుమార్ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బిక్కవోలు

కొంకుదురు ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని కురందాసు గణేశ్వరికి హైదరాబాద్‌కు చెందిన మాదిరెడ్డి జగన్నాథరావు నాయుడు మెమోరియల్ ట్రస్ట్ రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కురందాసు గణేశ్వరి మాట్లాడుతూ 2022లో పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసి, ప్రస్తుతం ఆదిత్య విశ్వవిద్యాలయంలో బి.టెక్ చదువుకుంటున్నట్లు తెలిపింది. గత మూడేళ్లుగా అందిస్తున్న ఈ ఆర్థిక సాయం తన విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడిందని, భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ సత్తి వీరమణి రాజా, జెడ్‌పిటిసి రొంగల పద్మావతి, నీటిపారుదల సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షుడు చింతా శ్రీనివాస రెడ్డి, ఎంపిటిసి నల్లమిల్లి అమ్మిరెడ్డి, పివి.సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

భారీ వర్షంతో ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి మండల పరిసర ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. 64.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఈ భారీ వర్షం కారణంగా పలు గ్రామాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. మండల కేంద్రమైన తాళ్లపూడి మెయిన్ బజార్లో వర్షం నీరు బయటకు పోయే మార్గం లేక పలు ప్రాంతాల్లో నీరు రోడ్లపై చేరి ప్రయాణికులు అనేక ఇక్కట్లు గురయ్యారు. నిత్యావసర వస్తువులు కొనుగోలు కోసం ప్రతిరోజూ అనేక గ్రామాల నుంచి గృహస్తులు, చిల్లర వ్యాపారులు, తాళ్లపూడి గ్రామానికి వస్తుంటారు. రోడ్లపై వర్షపు నీరు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ బజార్‌లోని దుకాణదారులు పాత డ్రైనేజీలను ఆక్రమించి భవనాలను నిర్మించడంతో వర్షపు నీరు బయటకు వెళ్లడం లేదంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు, ఎందరు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మారినప్పటికీ చిరకాల సమస్యగా మిగిలిన తాళ్లపూడి మెయిన్ బజార్ ఆక్రమణ విషయంపై పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గజ్జరం పంట పొలాల దగ్గరలో పోచవరం వెళ్లే రహదారిపైకి వర్షపు నీరు చేరింది. దీంతో ఆ గ్రామానికి వెళ్లే ప్రజలు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని వేగేశ్వరపురంలో కూడా వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక అనేక ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది. శనివారం సాయంత్రం కూడా మండలంలో భారీ వర్షం కురిసింది.



భారీ వర్షంతో జలమయం అయిన రహదారి

ఆలయ కమిటీ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -దేవరపల్లి

యర్నగూడెంలోని మదన గోపాలస్వామి ఆలయ కమిటీ అధ్యక్షునిగా బొల్లిన వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. సభ్యులుగా సత్తిరాజు రామకృష్ణ, మారుతీ శివాత్మ, కూసంపూడి నరేష్ వర్మ, మెంటెం వెంకటలక్ష్మి, ముంగర వెంకటలక్ష్మి, దాసరి రాంబాబు, పుట్టా సూరీడు, జగతి నాగలక్ష్మి, ఎక్స్ అఫీషియో సభ్యునిగా గోవర్ధనం విజయసారథి నియమితులయ్యారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని, బాధ్యతలు అందించిన ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, టిడిపి మండల అధ్యక్షుడు ఆండ్రు అనిల్, సొసైటీ చైర్మన్ పెన్మెత్స సుబ్బరాజు గ్రామ కమిటీ అధ్యక్షుడు బొల్లిన విజయభాస్కర్, కాలేజ్ చైర్మన్ గద్దె శ్రీనివాస్, బళ్ల సూర్యచక్రం తదితరులకు నూతన కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'



ఉత్తమ సేవలకు పురస్కారాలు

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో పలు శాఖలకు చెందిన ఉద్యోగులు ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి ద్వారా వారు పురస్కాలు అందుకున్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గోకవరం ఎంపిడిఒ ఎం.గోవింద్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో టైపిస్టు జి.కిశోర్ కుమార్ కూడా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. వారికి పలువురు మండల అధికారులు, నాయకులు, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. ప్రశంస పత్రం అవార్డును ఎంపీడీఓ ఎం గోవింద్ అందుకున్నారు.

చాగల్లు తహశీల్దారు ఎం.మెరికమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రవణ్ కుమార్ ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. వారిని పలువురు మండల అధికారులు, నాయకులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నిడదవోలు ఎంపిడిఒ జగన్నాథరావు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఆయనకు పలువురు మండల అధికారులు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కడియం జేగురుపాడు పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ జె.శ్రీరామ్ రవి కిరణ్ రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. గుంటూరులో రాష్ట్ర స్థాయి పురస్కార వేడుకల్లో, రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ సిఇఒ డాక్టర్ శ్రీనివాస రావు ద్వారా రవి కిరణ్ పురస్కారం అందుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా ఉత్తమ సహాయ సంచాలకునిగా కడియం ఏరియా వెటర్నరీ ఆసుపత్రి పశువైద్యాధికారి డాక్టర్ రవివర్మకు పురస్కారం లభించింది. వీరిని పలువురు అభినందించారు.

తాళ్లపూడి మండలానికి చెందిన పలువురు అధికారులు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. ఎస్ఐ టి.రామకృష్ణ, ఎంపిడిఒ వేణుగోపాల్‌రెడ్డి, ఎపిఎం మంగాయమ్మ, విద్యా శాఖ ఎంఐఎస్ శ్రీనివాస్ పురస్కారాలు అందుకున్నారు. వీరిని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న కడియం పశు వైద్యాధికారి రవికిరణ్



పురస్కారం అందుకుంటున్న గోకవరం ఎంపిడిఒ గోవింద్



పురస్కారం అందుకుంటున్న చాగల్లు తహశీల్దారు మెరికమ్మ



పురస్కారం అందుకుంటున్న తాళ్లపూడి ఎస్ఐ రామకృష్ణ



పురస్కారం అందుకుంటున్న నిడదవోలు ఎంపిడిఒ జగన్నాథ్

ఉచితంతో ఉత్సాహం.. వర్షంతో నిరుత్సాహం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'స్త్రీ శక్తి' పథకం కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది తరువాత ఎట్టకేలకు అమలోకి వచ్చింది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా నాయకులతో ఉత్సాహం కనిపించింది. అయితే మహిళల నుంచి అనుకున్నంత స్పందన కరువైంది. అంగన్‌వాడీలు, మహిళా ఉపాధి కూలీలను అధికారులు దగ్గరుండి బస్టాండ్‌లకు మహిళలను తరలించారు. కాకినాడ జిల్లా జగ్గంపేటలో 5 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం రాత్రి 7 అయినా ప్రారంభం కాలేదు. దీంతో బస్సులో ప్రయాణం కోసం, బస్సు సర్వీసు ప్రారంభం కోసం మహిళలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉచిత బస్సు ప్రయాణం ఉన్నప్పటికీ ఎక్కడా మహిళలు ఉత్సాహంగా ముందుకు వచ్చిన దాఖలాలు లేవు. ఎప్పటి మాదిరిగానే వారు ప్రయాణాలు చేశారు. ప్రయాణికుల సంఖ్య కూడా పరిమితంగానే ఉంది. సెలవులు అయినప్పటికీ మహిళలు ఉత్సాహం చూపకపోవడం నాయకులను నిరుత్సాహానికి గురిచేసింది. ఇక ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో జనసేన, టిడిపిల మధ్య పొరపొచ్చాలు 'స్త్రీశక్తి' పథకంలో మరోసారి వెలుగు చూశాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా పిఠాపురంలో మాత్రం జనసేన, టిడిపి నాయకులు వేర్వేరుగా ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కాకినాడ జిల్లాలోనే ఉన్న సమయంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మరోవైపు ఉచిత బస్సుల వల్ల తాము ఉపాధిని కోల్పోతామంటూ ఆటో కార్మికులు రోడ్డెక్కారు. పలుచోట్ల ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందించారు. శనివారం జిల్లా వ్యాప్త నిరసనలకు వారు దిగారు.

వాతావరణ హెచ్చరికలతో బెంబేలు

ఫ్లాష్ ఫ్లడ్స్, క్లౌడ్ బరెస్ట్ అంటూ వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు ప్రజల్లో భయాందోళనకు గురిచేస్తున్నాయి. వాతావరణంలో మార్పులు కూడా వారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడనాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మొన్నటి వరకూ వర్షాభావంతో కొంత పంట పాడైతే ఇప్పుడు అధిక వర్షంతో ఉన్న పంట కొట్టుకుపోయే పరిస్థితి వచ్చింది. తూర్పు గోదావరి జిల్లాలో ఉండ్రాజవరం, చాగల్లు, పెరవలి, నిడదవోలు రూరల్ మండలాల్లో ఇప్పటికే వరిచేలు నీట మునిగాయి. ఈ నష్టంపై అధికారులు నేటికీ ఎలాంటి ప్రకటన చేయలేదు. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు, క్లౌడ్ బరెస్ట్‌లు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేయడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మరో పక్క పల్లపు ప్రాంతాల్లో మోకాళ్లోతు నీటిలో ఉన్నాయి. కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షపు నీరు ప్రవేశించింది. వర్షపు నీటిలోనే కూర్చొని అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. కొత్త జిల్లా ఏర్పాడినా నేటికీ సొంతంగా పక్కా భవనాలు లేక ఇలా అద్దెభవనాల్లో అరకొర వసతుల మధ్యనే ఉద్యోగులు కాలం వెళ్లదీస్తున్నారు.



ఎన్నికలు లేకుండానే పిఎసిఎస్‌ల పాలకవర్గాలు

గత ప్రభుత్వం మాదిరిగానే ఎలాంటి ఎన్నికలు లేకుండానే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా పిఎసిఎస్‌లకు కమిటీలను ఏర్పాటు చేసింది. త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకుంది. నాయకుల అనునాయకులు పదవులను ఇచ్చి ప్రసన్నం చేసుకునే విధంగా గత వైసిపి సర్కారు మాదిరిగానే వ్యవహరిస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సొసైటీల్లో పూర్తిస్థాయిలో పాలక వర్గాలు లేకపోవడంతో రైతులకు పూర్తిస్థాయి సేవలు అందట్లేదు. కూటమిలోనైనా ఎన్నికలు నిర్వహిస్తారని రైతులంతా ఎదురు చూశారు. వారి ఆశలను అడియాలు చేస్తూ కూటమి సర్కారు త్రిమెన్ కమిటీలను నియమించి చేతులు దులిపేసుకుంది. ఇప్పటికే ఈ కమిటీలు పదవీ బాధ్యతలను సైతం స్వీకరించాయి. పదవులు అందించిన మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి తమ కృతజ్ఞతలు తెలిపి భక్తిని చాటుకున్నాయి. మరోపక్క కమిటీల్లో న్యాయం జరగలేదని కొంత మంది ముఖం చాటేసిన దాఖలాలు లేకపోలేదు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ మృతి చెందాడు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన వల్లూరి సాయి నిరంజన్(26) గత ఏడాది ఆగస్టు 23న వివాహమైంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అతను శనివారం ఉదయం తన అత్తింట వారు నివాసముంటున్న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు వెళ్లారు. అతను శనివారం సాయంత్రం తన బైక్‌పై తిరుగు ప్రయాణ మయ్యారు. కొత్తూరు - వెదురుమూడి ఆర్అండ్‌బి రోడ్డు బోడిచెట్టు సమీపంలోనున్న కోళ్ల ఫారం వద్ద వేగంగా వచ్చిన లారీ అతని బైకును వెనుక నుంచి ఢీకొంది. దీంతో సాయి నిరంజన్ తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. అంతలో స్థానికుల ప్రయివేటు వాహనంపై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా సాయి నిరంజన్ మార్గమధ్యలో మృతి చెందాడు. ఈమేరకు ఎస్ఐ నరేష్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక టోల్‌గేట్ సమీపంలో కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో హైవేపై వెళుతున్న ఒకదాని వెనుక ఒకటి చొప్పున మూడు కార్లు ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వ్యక్తి కోసం గోదావరిలో గాలింపు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని కర్రివానిరేవు గ్రామానికి చెందిన వ్యక్తి కనపడక పోవడంతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ఇవి.. కర్రివానిరేవు గ్రామానికి చెందిన అర్థాంగి గోవింద రాజులు (30) వెల్డింగ్ వర్కర్‌గా పని చేస్తూ భార్య, బిడ్డలను పోషించుకుంటున్నాడు. అతడు గత గురువారం నుంచి వెళ్ళి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపులో అన్నంపల్లి కొత్త అక్విడెక్ట్‌పై గోవింద రాజుల బైక్‌ను, అక్కడే అతడి దుస్తులు, చెప్పులు ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించారు. బైక్ పక్కన యాసిడ్ బాటిల్ కూడా మూత తీసి ఉండడం గుర్తించారు. కానీ అతడి మొబైల్, ఇయర్ ఫోన్స్ మాత్రం లేకపోవడం గమనార్హం. గోవిందరాజులుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం గోవింద రాజులు భార్యతో తన స్నేహితుడు డబ్బులు ఇస్తానని చెప్పాడని చెప్పి బైక్ పై వెళ్ళి తిరిగి రాకపోవడంతో పాటు మొబైల్ స్విచ్ ఆఫ్ అయి ఉంది. అన్నంపల్లి అక్విడెక్ట్‌పై బైక్‌ను గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ డి.జ్వాలా సాగర్ దీనిపై విచారణ చేపట్టారు. గ్రామస్తులు, అతని బంధువులు మురమళ్ళ వృద్ధ గౌతమి గోదావరి లో మోటర్ పడవలపై కుండలేశ్వరం, పల్లంకుర్రు, బ్రహ్మ సమేథ్యం తదితర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

చెరువు నుంచి నీరు బయటకు రాకుండా తూము కట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రాంపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని రాంపాలెం గ్రామానికి చెందిన రైతు బుల్లి వెంకన్న(39) వరి సాగు చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలోని బాలంక చెరువులోకి నీరు అధికంగా చేరింది. చెరువు నుంచి వచ్చిన నీరు తన వరి పంట మీద పడడంతో చెరువు నీరు బయటకు రాకుండా తూము కట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగి మరణించాడని తెలిపారు. మృతుని భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్టు స్టేషన్ రైటర్ కె.దుర్గారావు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - కొవ్వూరు

మండలంలోని కుమారదేవం ఏటిగట్టు వద్ద గెస్ట్ హౌస్‌లో పని చేస్తున్న బొక్క రత్నరాజు (48) శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గెస్ట్ హౌస్ వద్ద ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లిన రత్నరాజు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగపై కాలు వేయడంతో విద్యుత్ శాఖకు గురయ్యాడు. సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచిపెట్టారు. మృతుని సోదరుడు కుమారుడు లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని జిల్లాలో పలు చోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు.

అమలాపురం: స్థానిక కలెక్టరేట్ నందు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధి కారికంగా జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ గౌతు లచ్చన్న చిత్రప టానికి అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావు, బిసి వెల్ఫేర్ వసతి గృహ సంక్షేమ అధికారులు కల్పవల్లి అనురాధ, గౌరీ కాత్యాయని సిహెచ్.సాయిరాం, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** స్థానిక బిసి కన్వెన్షన్ హాల్ నందు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శనివారం మండల శెట్టిబలిజ సంఘ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, సంఘ ప్రతినిధులు గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల శెట్టి బలిజ సంఘ అధ్యక్షుడు కముజు వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుబ్బల సత్తిపండు, ట్రెజరర్ కుడుపూడి వెంకటేశ్వరావు, బొంతు గౌరి శంకర్, బొక్కా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో లచ్చన్న విగ్రహం వద్ద నాయకుల నివాళి


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఎంఎల్‌సి ఇజ్రాయిల్‌పై విమర్శలు తగవు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ పై జన సైనికులు ఇష్టానుసారంగా వ్యక్తిగతంగా విమర్శలు చేయడం తగవని వైసిపి నాయకులు అన్నారు. భీమనపల్లిలో శనివారం వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్ అధ్యక్షతన పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. వైసిపి కి చెందిన ఎంఎల్‌సి ఇజ్రాయిల్ అవమానిస్తూ కావాలనే కొందరు సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇటీవల ఎంఎల్‌సి ఇజ్రాయిల్ బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ సమావేశంలో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిఎం కావాలని ఆయన అభిమానులు కలలు కంటూ త్యాగాలు చేస్తుంటే, పవన్ కళ్యాణ్ 15 ఏళ్ల పాటు టిడిపి తో సహవాసం చేయాలని జన సైనికులకు సందేశం ఇస్తున్నారని విమర్శించడంలోతప్పేముందని వైసిపి నాయకులు ప్రశ్నించారు. జరుగుతున్న రాజకీయ పరిస్థితులపై సందర్భాను సారంగా ఎంఎల్‌సి ఇజ్రాయిల్ మాట్లాడితే దానికి జన సైనికులు ఏది పడితే అది ఆధారాలు లేని వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎంఎల్‌సి ఇజ్రాయిల్‌పై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. లేకుంటే వైసిపి తరపున తగిన బుద్ధి చెప్పేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచ్, ఎంపిటిసిల సమాఖ్య మండల అధ్యక్షులు కడిమి చిన్నవరాజు, పెట్టా అప్పారావు, సర్పంచ్ లు పెయ్యల రాజ్ కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు, మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, నాయకులు సాధనాల శ్రీను, కుంచే స్వామి, కాట్రు కష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై ప్రజలు తిరుగుబాటు చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం


మాట్లాడుతున్న ఎంఎల్‌సి సూర్యనారాయణరావు


విద్యుత్ వినియోగ దారులు తీవ్రంగా నష్టపోయే స్మార్ట్ మీటర్ల బిగింపుపై ప్రజలు తిరుగుబాటు చేయాలని, వారికి వైసిపి అండగా ఉంటుందని ఎంఎల్‌సి కుడిపూడి సూర్య నారాయణరావు అన్నారు. శనివారం ఆయన అమలాపురం శెట్టిబలిజ గ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ వినియోగదారుడు అనుమతి లేకుండా మీటర్లు బిగించుకోకూడదని కంపెనీలు ప్రభుత్వానికి ఇచ్చిన నిబంధనలో ఉందన్నారు. కానీ అది పాటించకుండా విద్యుత్ శాఖ అధికారులు బలవంతంగా అదాని స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. తక్కువ వాడే విద్యుత్ వినియోగదారుడుకి ఇకపై రూ.వేలల్లో బిల్లు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. గతంలో విద్యుత్ ఛార్జీలు పెంచి కొన్ని పార్టీల పతనానికి గురి అయ్యాయని నేడు అదే పరిస్థితి కూటమి ప్రభుత్వం ఎదురుకోవాల్సి వస్తుందని ఎంఎల్‌సి అన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర, న్యాయవాది వైసిపి నాయకులు కుడుపూడి త్రినాధరావు, నాయకులు ముంగర ప్రసాద్, దండుమేను రూపే ష్, కుడుపూడి వెంకటేష్, సామాజిక సేవాకర్త గాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎంఎల్‌ఎ సత్యానందరావు, పాల్గొన్న దాతలు

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - కొత్తపేట

మెరిట్ విద్యార్థులకు పలువురు దాతలు నగదు ప్రోత్సాహకాలను శనివారం అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని గ్రామ పంచాయతీ తరపున వాడపాలెం జడ్పి హైస్కూల్‌లో 10 తరగతి చదువుకున్న విద్యార్థులకు ఇంటర్మీడియట్లో మెరుగైన విద్య కోసం ప్రోత్సాహకాలు అందించాలని ఉద్దేశంతో ఇంటర్ మొదటి సంవత్సరానికి చెందిన 5గురికి, ఇంటర్ రెండో సంవత్సరానికి 5గురికి వ మొత్తం 10మందికి విద్యార్థులకు రూ.1.50లక్షలు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరిగింది సర్పంచ్ త్సామాబాబు అన్నారు. గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి రూ.30 వేలు, సర్పంచ్ రూ.40 వేలు ఈ గ్రామానికి చెందిన వివిధ ప్రాంతాలలో స్థిరపడి గ్రామ శ్రేయోభిలాషులు చీకట్ల ప్రసాద్, చిట్టాల పద్దరాజు, చోడిశెట్టి సురేష్, మట్టా వెంకన్న మనుమరాలు విజయలక్ష్మి, కాశిన వంశీకృష్ణ, చీకట్ల రవి, బండారు వెంకటేశ్వర్లు , శ్రీకాకుళపు సతీష్ (అమెరికా), బండారు వెంకటేశ్వర్లు, బండారు సత్య నారాయణ రూ.80వేల విద్యార్థులకు అందించిన ప్రోత్సాహకాలను సమకూర్చారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు చేతుల మీదుగా మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, సభ్యులు,గ్రామ పెద్దల చేతుల మీదుగా విద్యార్థుల కు ప్రోత్సాహకాలు అందించారు. గ్రామ సీనియర్ సిటిజెన్ చీకట్ల రామారావును సత్కరించారు.


దీప్తి స్కూల్లో కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

ఘనంగా దీప్తి స్కూల్లో కృష్ణాష్టమి

ప్రజాశక్తి - మామిడికుదురు

స్థానిక దీప్తి స్కూల్లో కరస్పాండెంట్ డివివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులుఅలరించారు అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. అప్పనపల్లి పాత గుడి వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమంతో పాటు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

ఆరుతడి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-గోకవరం

కామరాజుపేటలో ఆరుతడి పద్ధతిపై రైతులకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటిఎల్ బసవన్న గౌడ్, ఎన్ఎఫ్ఎండిఎల్.దేవి మాట్లాడారు. రైతులకు ప్రకృతి వ్యవసాయలో ఆరుతడి విధానం అనుసంధానం చేస్తూ రైతులకు ప్రకతి వ్యవసాయ దిగుబడి, లాభాలు, ప్రకతి వ్యవసాయ పంటలు వల్ల ఆరోగ్య ప్రయోజనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ప్రకతి వ్యవసాయ సిబ్బంది, ఎల్2లు ఉమాదేవి, లక్ష్మీ, మంగ పాల్గొన్నారు.

కడియంలో ఘనంగా కృష్ణాష్టమి

ప్రజాశక్తి-కడియం

కడియం భ్రమరాంబ సమేత మల్లేశ్వరి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పిండి శ్రీను దం పతులు పూజలు నిర్వహించారు. చిన్నారులతో భరతనాట్య నృత్య ప్రదర్శన భక్తు లను ఆకట్టుకుంది. అనంతరం కోలాహలంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వ హించారు. గోశాల సంరక్షణ సమితి అధ్యక్షుడు గిరజాల బాబు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి యాత్రికులకు వర్తించని స్త్రీ శక్తి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎంతో ఆర్భాటంగా శుక్రవారం ప్రారంభించింది. అయితే వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి సుమారు 30 డిపోలు పైబడి వంద బస్సులు వరకు వివిధ ప్రాంతాల నుంచి ప్రతీ శనివారం వస్తున్నాయి. అలాగే రావులపాలెం బస్ డిపో నుంచి కూడా ప్రతి శనివారం అనేక బస్సు సర్వీసులు ఎపిఎస్ఆర్‌టిసి అధికారులు నడుపుతున్నారు. వాడపల్లి వెంకటేశ్వర ఆలయానికి ఉచిత బస్సులో ప్రయాణం చేయవచ్చు అనుకున్న యాత్రికులకు ఒకసారి అవా క్కయ్యారు. వాడపల్లి వెంక టేశ్వర స్వామి ఆల యానికి వెళ్లే స్పెషల్ బస్సులు వీటికి.. స్త్రీ శక్తి పథకం వర్తించదని బోర్డులు పెట్టడంతో యాత్రికులు టిక్కెట్ తీసుకుని బస్సు ప్రయాణం చేశారు.

ఉచిత బస్సు ప్రయాణానికి ఇవి తప్పనిసరి..

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించింది.ఈ పథకం ద్వారా మహిళలు లబ్ధి పొందాలంటే ఇవి తప్పని సరిగా చూపించాల్సిందే. అందుకు అవసరమైన పత్రాలు ముందుగా రాష్ట్రానికి చెందిన మహిళలై ఉండాలి. అందుకు తగిన ఆధారాలు చూపించాలి. అర్హతకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడి, రేషన్ కార్డు ఇలా ఏదో ఒకటీ లబ్ధిదారు ఫొటో ఉన్న గుర్తింపు కార్డు ను బస్ కండక్టర్ కు చూపించిన తర్వాతే టిక్కెట్ ఇస్తారు. ఈ కింద చెప్పిన కార్డుల్లో ఏదో ఒకటి చూపించాలి. స్థానికతను తెలియజేసే అడ్రస్ పత్రాలు జిరాక్స్ కాపీలు చెల్లవు. కేవలం ఒరిజినల్ కార్డులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. విద్యార్థులకు స్కూల్లో ఇచ్చిన ఐడీ కార్డు చూపించాలి వీటిలో ఏది లేకపోయినా డబ్బులు చెల్లించి టిక్కెట్ తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఫైన్ కట్టాలి. అందుకే ఎల్లప్పుడూ ప్రయాణికులు ఏదో ఒక గుర్తింపు కార్డు ఉంచుకోవడం మంచిది. ఏ బస్ లో ఉచిత ప్రయాణం చేయవచ్చునో కచ్చితంగా తెలుసుకోవాలి. అన్ని బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయడానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. కేవలం పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఈ బస్సుల్లో మాత్రమే జిరో ఫెయిర్ టికెట్ ఇస్తారు. ఇంద్రా ఎసి, సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్, ఇతర రాష్ట్రాలకు నడిపే సర్వీస్ లకు ఉచిత పథకం వర్తించదు. అందులో ప్రయాణం చేయాలంటే మాత్రం తప్పని సరిగా టికెట్ తీసుకోవాల్సిందే. మహిళా ప్రయాణికులు ఈ నియమాలు తప్పని సరిగా తెలుసుకోవాల్సిందే నని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలి

అఖిలపక్ష పక్ష కమిటీ తీర్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజక వర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని అఖిలపక్ష సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రముఖ న్యాయవాది మాగాపు అమ్మి రాజు అధ్యక్షత రామచంద్రపురం టిడిపి నాయకులు గరికిపాటి సూర్య నారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉండవిల్లి గోపాల్ రావు, వైసిపి పట్టణ అధ్యక్షులు గాదంశెట్టి శ్రీధర్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కష్ణ, న్యాయవాదులు గాలింకి చిట్టిబాబు, దొమ్మల పాటి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఖాన్, విక్టర్ నంద, షర్మిల పార్టీ అధ్యక్షులు కోట శ్రీనివాస్ రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం ప్రజల సౌలభ్యం, పరిపాలనా సదుపాయాలు, అభివృద్ధి దృష్ట్యా ఈ విలీనం అత్యవసరం అని పేర్కొన్నారు.. రాబోయే రోజుల్లో ఈ డిమాండ్ నెరవేర్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని జెఎసి నాయకులు సమావేశంలో స్పష్టం చేశారు. జెఎసి నాయకులు సోమవారం నుండి సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ప్రజల ఆకాంక్ష నెరవేర్చే వరకు నిరంతర పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. రామచంద్రపురం ప్రజల సమిష్టి కృషితో ఈ ఉద్యమాన్ని విజయవంతం చేసి, కాకినాడ జిల్లాలో విలీనం సాధించడమే జెఎసి లక్ష్యం అని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎ. రేశ్వంత్ రాయ్, టిడిపి నాయకులు బాబూరావు, సిపిఐ నాయకులు పి. రాము, సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ నాయకులు వి.భీమా శంకరం, టిడిపి నాయకులు బలరాం, నాయుడు మాస్టర్, లాయర్స్ కమల కుమారి, హరినాద్ రాష్ట్ర విఆర్ఒ సంఘాల అధ్యక్షులు బాపూజీ తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం


ముమ్మిడివరంలో గడపగడపకు రాజ్యాంగం గోడ పత్రిక ఆవిష్కరణ

రాజ్యాంగ పరిరక్షణ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో శనివారం శరత్ అధ్యక్షతన రాజ్యాంగ పరి రక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పెనుమాల సుధీర్ ముఖ్య అతిథిగా పాల్గొని, తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికన భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులపై గడపగడపకూ వెళ్లి వివరించడమే కాకుండా బహుజనులను రాజ్యాధికారం వైపు తీసుకువెళ్ళడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అలాగే ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికా నిధులను ఆయా వర్గాల ప్రాంతాల్లోనే ఖర్చు చేసే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించి, చైతన్యం తీసుకువచ్చేందుకు కషి చేస్తున్నామన్నారు. రాజ్యాధికారంతోనే బడుగు బలహీన వర్గాల అభివద్ధి సాధ్యమవుతుందని నియోజకవర్గ రాజ్యాంగ పరిరక్షణ కమిటీ పేర్కొంది. అనంతరం గడప గడపకు అంబేద్కరిజం భారత రాజ్యాంగం పై అవగాహన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, దాసరి సత్యనారాయణ, ఇసుకపట్ల పాపారావు, దుక్కిపాటి సూర్యనారాయణ, జనిపల్లి సత్యనారాయణ, పెట్టా శ్రీనివాస్, తాటిపాక దుర్గ బాబు, జెవివి.సత్య నారాయణ, బడుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మందేశ్వరస్వామిని దర్శించుకున్న సివిల్ జడ్జి హిమబిందు

ప్రజాశక్తి - కొత్తపేట

మందపల్లిలో మందేశ్వర స్వామిని శనివారం సివిల్ జడ్జి హిమబిందు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు అనంతరం స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. శనివారం తెల్లవారుజాము నుంచి అత్యధిక సంఖ్యలో యాత్రికులు స్వామివారి దర్శించుకున్నారు. స్వామివారికి తైలాభిషేకాల ద్వారా రూ.1,57,885, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.33695 మొత్తం వెరసి రూ.1,91,581 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.

నల్లూరు పిఎసిఎస్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

నల్లూరు పిఎసిఎస్ అభివృద్ధికి కృషి చేస్తానని సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ వల్లూరి అప్పులరాజు అన్నారు. ఇటీవల ఛైర్మన్ అప్పలరాజు తో పాటు డైరెక్టర్లుగా కురుపూడి శ్రీనివాస్, బీరా సూర్యారావు ప్రమాణ స్వీకారం చేశారు . ఈ సందర్భంగా శనివారం సొసైటీ ఛైర్మన్ అప్పల రాజు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ పదవి బాధ్యతలు చేపట్టినాటినుంచి సుమారు రూ.40 లక్షల వరకు రైతులకు కొత్త రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సొసైటీ పరిధిలోని నల్లూరు, వెదురుమూడి, గ్రామాలు ఉండగా 686 మంది రైతులు, రుణ దారులు 380 మంది ఉన్నారన్నారు.

రిటైర్డ్ పోస్ట్‌మ్యాన్ మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎర్ర పోతవరం గ్రామంలో పోస్ట్ మాన్‌గా పనిచేసిన కొసనా మోతిలాల్ (85) అశుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుమారు 50 సంవత్సరాలు పాటు ఆయన పోస్ట్ మ్యాన్‌గా సేవలు అందించారు. గ్రామస్తులకు ఎంతో చనువుగా ఉండేవారని ఆయన మృతి పట్ల గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు, ఉప సర్పంచ్ మణిబాబు, కోలా నాగేశ్వరరావు, రాయపు రెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య, సాపిరెడ్డి దొరబాబు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కొసనా కామేశ్వరరావు, కోసన భీమశంకరం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మడికిలో వివిధ కారణాలతో మృతి చెందిన, గాయపడిన పలు బాధిత కుటుంబాలను ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శనివారం పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. అలాగే మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే గాయపడిన బాధితులకు ప్రభుత్వం నుంచి అందే సహాయం వేగంగా వచ్చేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆలమూరు డిసి అధ్యక్షుడు మరల గోపాలస్వామి, టిడిపి గ్రామ అధ్యక్షుడు దొండపాటి సుబ్బరాజు, నేతలు కొత్తపల్లి కృష్ణ, పెనుమాక సూరిబాబు, పంపన అంజిబాబు, అడబాల శ్రీనివాస్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటీసు ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి వారి కోర్టు (సీనియర్ డివిజన్), అమలాపురం

ఐ.ఎ. నెం. 497/2022

ఓ.ఎస్. నెం. 31/2021

మధ్య:
కుంపట్ల వీర వెంకట సత్యనారాయణ ...పిటిషనర్/వాది
మరియు
గిడుగు నాగేశ్వరరావు (మృతుడు)
& ఇతరులు ...ప్రతివాదులు

R-3: గిడుగు (చాగంటి) శివలక్ష్మి బాల ప్రశాంతి, భర్త: మధు, హిందూ, వయస్సు సుమారు 38 సంవత్సరాలు, డోరు నెం. 4-35/1, మొండపులంక గ్రామం, పి.గన్నవరం మండలం, డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఇలాఖ.

R-4: గిడుగు (అడపా) రామమణి, భర్త: కిరణ్‌కుమార్, హిందూ, వయస్సు సుమారు 35 సంవత్సరాలు, డోరు నెం. 4-35/1, మొండపులంక గ్రామం, పి.గన్నవరం మండలం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఇలాఖ.

నోటీసు

పై పేర్కొన్న కేసులో మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపబడినప్పటికీ, మీరు ఉద్దేశపూర్వకంగా స్వీకరించక ఆలస్యం చేస్తున్నారు. కాబట్టి, కోర్టు ఆదేశానుసారం, ఈ పేపర్ ప్రకటన ద్వారా మిమ్మల్ని **21-08-2025 తేదీ ఉదయం 10:30 గం॥లకు** పై కోర్టులో హాజరు కావలసిందిగా నోటీసు ఇస్తున్నాము. మీరు స్వయంగా గాని లేదా మీ తరఫున న్యాయవాది ద్వారా గాని హాజరై, మీ ఆక్షేపణలు పై కోర్టులో తెలియజేయవలసి ఉంటుంది. మీరు హాజరు కాని యెడల, మీ పరోక్షమున కేసు విచారణ కొనసాగించబడును.

అడబాల త్రినాధ ప్రభాకరరావు,
అమలాపురం అడ్వకేట్, కొత్తపేట.
ది.16-8-25 సెల్: 9494429922

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, హుస్సేన్‌పురం, ఎస్సీపేట, గ్రామ వాసి అయిన దుగ్గాడ సత్తిబాబు అను నేను సామర్లకోటలో **ది.15-02-2025వ** తేదీన కాకినాడ వెడుతుండగా మార్గ మధ్యలో సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో నా పాస్‌పోర్టు పోయినది. నా పాస్‌పోర్టు నెంబరు. **ఎన్ 5526040** కావున ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరని కోరుచున్నాను.

దుగ్గాడ సత్తిబాబు
S/o. సమర్పణరావు,
డోర్‌నెం.3-116, ఎస్సీపేట,
హుస్సేన్‌పురం-533434, సామర్లకోట మండలం,
కాకినాడ జిల్లా. ఫోన్ నెం.8897483865o

ప్రకటన

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

HMOP No.134/2024

Between:-
చోడిశెట్టి (గెడ్డమూరి) కృష్ణవేణి ...పిటిషనర్
మరియు
గెడ్డమూరి శ్రీనివాసు ...రెస్పాండెంట్టు.

గెడ్డమూరి శ్రీనివాసు S/o. లేటు సత్యనారాయణ, 40సం॥లు,డో.నెం.70-2-90, ఆకుల వారి వీధి, సర్పవరం జంక్షన్, కాకినాడ రూరల్. ...రెస్పాండెంట్

పై నెంబరు కేసులో శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం పిటిషనర్ ఎన్నిమార్లు నోటీసు బేటాను కట్టిననూ మీరు అందుకోకుండా తిప్పి వేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ నోటీసు పూర్వకముగా తెలియజేయునది ఏమనగా మీరు స్వయముగా గాని, న్యాయవాది కృతముగా గాని **29-08-2025** తేదీన పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం **10.30** నిమషములకు హాజరుగా ఉండవలయును. అట్లు కాని యెడల దావాను మీ పరోక్షమున తీర్మానించెదరని రూఢిగా నమ్మవలయును.

కొత్తకోట సత్యసూర్యనారాయణ
అడ్వకేట్, పిఠాపురం

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT NARASANNAPETA O.S.NO. 40/2024

Between:-
Thota Venkata Subbaraju ......Plaintiff.
And:-
Satti Padmavathi & 5 Others .....Defendants

To,
D-1: Satti Padmavathi,
W/o late Venkatarami reddy,
aged 58 years, Hindu,
household duties,
residing at Rayavaram village,
Anaparthi mandal, EG district.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల దావాలో మీకు నోటీసు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **తేదీ 19-08-2025 న ఉదయం: గం॥10-30 ని॥** లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావాలో మీ పరోక్షమునందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

// పై కోర్టు ఉత్తర్వుల ప్రకారం //

కె. నాగభూషణరావు, హెచ్. రామకృష్ణ
న్యాయవాదులు, శ్రీకాకుళం,
ఫోన్: 9908370082